"ఈ బస్సు మన అందరిది. దీనిని పరిశుభ్రంగా వుంచుదాం'' అక్షరాలు అందంగా వున్నాయ్. ముత్యాల్లా వున్నాయ్. ముచ్చటగా వున్నాయ్. ఆలోచనలే... వికారంగా, వికృతంగా, విపరీతంగా వున్నాయ్. ఎన్నన్నా చెప్పండి. సక్రమంగా మాత్రం లేవు.

"గురూ... ఈ బస్సు మనందరిదీ, అంతవరకూ మనకే అభ్యంతరమూ లేదు, కానీ... దీనిని పరిశుభ్రంగా వుంచుదాం అంటే!... అంటే మనందరం బస్సులు క్లీన్ చేసేవాళ్ళమనేగా అర్థం'' మత్తుగా పలికిందో గొంతు.




"అవును గురూ... భలే చెప్పావ్. నువ్ చెప్పేవరకూ అసలా పాయింటే ఎవరికీ వెలగలేదు'' మత్తు మాటలకు వంత పలికింది మరో గొంతు. ఆ రెండు గొంతులూ కలిసి మత్తుగా, పిచ్చిగా అలా అలా వాగిన దంతా వాడవాడలకూ పాకిపోయింది. మగతలో వున్న యువత అంతా ఒక్కటయ్యారు. అంతే... బస్సుల అద్దాలు ముక్కలు ముక్కలైపోయినై. 'యువతను కించపరుస్తున్న వ్రాతలు' అంటూ నినాదాల్తో బారులు తీరిన బస్సుల్ని ధ్వంసం చేయసాగారు.

సమన్వయ సంఘాలు వెలసినై. సలహా కమిటీలు పుట్టుకొచ్చినై. సంప్రదించేందుకు, సమాలోచనలు జరిపేటందుకు సహృదయులు ముందుకు వచ్చారు. యువతకు, భవితకు మధ్య సమన్వయం ఏర్పరచి సమస్య పరిష్కారానికి నడుం బిగించారు.

తాత్కాలికంగా బస్సుల విధ్వంస ప్రక్రియను ప్రక్కన పెట్టేందుకు యువతని, బస్సుల్లో వ్రాతల్ని మార్చేందుకు యాజమాన్యాన్ని ఒప్పించారు సహృదయులు. సుదీర్ఘ చర్చల అనంతరం ఇరువైపుల వారూ అనేకానేక ఆలోచనలయ్యాక-

"ఈ బస్సు మనందరిది. దీనిని పరిశుభ్రంగా వుంచుతాం'' అని మార్చేందుకు నిర్ణయించారు. ఈ నిర్ణయం బాగుందని మెచ్చుకున్నారు మేధావులు. "అవును మరి బస్సుల్ని శుభ్రపరిచి నీట్‌గా వుంచేందుకు ఉద్యోగులున్నారు. అది వాళ్ళ డ్యూటీ. జీతాలు వాళ్ళకీనూ... బాధ్యతలు మనకూనా!'' అంటూ తాము చేసిన ఘనకార్యాన్ని తామే సమర్థించుకుంది యువత.

కొన్ని వందల బస్సులు దగ్ధం అయ్యాక మొత్తం మీద ఉద్యమం ఉపశమనం పొందింది. ఆవేశం చల్లారింది. అయినా కొన్ని చోట్ల తగలబడ్డ బస్సుల ఇనుప కమ్మీలు ఇంకా చల్లారలేదు. అక్కడక్కడ ఇంకా పొగలు వస్తూనే వున్నాయి.

***

"స్త్రీలను గౌరవించటం మన సంప్రదాయం. వారికి కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనిద్దాం'' బోర్డుమీది అక్షరాలను చదివిన ఓ సుమతి మదిలో

# మూలిగే నక్కలు?

పెనుమాక నాగేశ్వరరావు

కథ




ఆవేదన, ఆగ్రహం, అవమానం లోంచి పుట్టిన ఆక్రోశం, ఆక్రోశం నుంచీ పుట్టిన ఆవేశం.

'యత్ర నార్యస్తు పూజ్యంతే' అన్న మన దేశంలో, మన రాష్ట్రంలో మహిళలకు ఇంతటి అవమానమా? దీన్ని ఉపేక్షించి, ఉదాసీనంగా ఉండి పోవటమా?... నో... నో... నో.

"ఎవరో కూర్చోనిస్తే మనం కూర్చోవటం ఏమిటి? ఒకరి దయా దాక్షిణ్యాలపైన ఆధారపడటం ఏమిటి? ఎవరైనా దయతలచి సీట్లో కూర్చోనివ్వటమా!' 'కూర్చోనిద్దాం' అనే పద ప్రయోగమే మహిళ జాతినంతటినీ కించపరిచే విధంగా వుంది. మమ్మల్ని అవమాన పరిచేదిగా వుంది. ఇలాంటి వాటిని క్షమించకూడదు. ఇవి క్షంతవ్యం కాని నేరాలు, ఘోరాలు. ఇకపై ఇలాంటి రాతలు చెల్లవ్...

బోలో తెలుగు మహిళకీ...జై...జై...జై...

జై...జై... పాకింది.....వూరు వూరు, వాడ వాడ, సందుల్లోకి, గొందుల్లోకి పాకిన ప్రచారం, పెల్లుబికిన ఆవేశం, మహిళా మణులంతా ఏకం అయ్యారు. కొంగు బిగించారు. ఆడువారికి అవమానం కలిగించే రీతిలో ఉన్న వ్రాతల్ని బస్సుల్లో రూపుమాపే వరకూ ఆందోళన ఆగదంటూ కని

పించిన ప్రతి బస్సుపైనా తమ ఆగ్రహాన్ని వెళ్ళగక్క సాగేరు. 'బస్సు' అంటే చాలు కస్సు బుస్సుమంటూ మాట్లాడసాగేరు.

పట్టుచీరెలు కట్టి పట్టణం నడిబొడ్డులో బ్యానర్లు పట్టుకు తిరగసాగేరు. మైకుల్లో తమ ఆక్రోశాన్ని ప్రజానీకానికి విన్నవించుకోసాగేరు. ఫలితంగా వందల బస్సులు ధ్వంసం అయిపోయినై. 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం. వాళ్ళు కూర్చున్న తర్వాతనే మిగిలిన వారం కూర్చుందాం' అని వ్రాతల్ని మార్చాలని ఏక గ్రీవ తీర్మానం చేశారు. ఎలాగో ఉద్యమంపై నీళ్ళుచల్లారు.

***

''తెలుగు మీడియం స్కూళ్ళను వెంటనే మూసి వేయాలి''

''తెలుగు మీడియం స్కూళ్ళను వెంటనే రద్దు చేయాలి''

''రద్దు చేయాలి, రద్దు చేయాలి''

''తెలుగు మీడియం స్కూళ్ళను వెంటనే రద్దు చేయాలి'' అన్న నినాదాలతో పెద్ద పెట్టున అరుస్తూ ఆవేశంగా అడుగులు వేస్తూ నడుస్తున్నారు– ప్రజానీకం, ఎక్కువ మంది నడివయసు వారే వున్నారు. అందులో చదువుకుంటున్న చిన్న పిల్లలు కూడా అక్కడక్కడ కనిపించకపోలేదు.

''భవిష్యత్తు లేని తెలుగు చదువులు మాకొద్దు''

''మాకొద్దు.... మాకొద్దు''

''ఇంగ్లీషు మీడియం చదువులే ముద్దు''

''ముద్దు... ముద్దు''

''దేని గురించండీ వాళ్ళ ఆందోళన... వాళ్ళంతా ఎవరు?'' దారినపోయే దానయ్య ప్రశ్న.

''పేరెంట్స్... కాన్వెంటు పిల్లల పేరెంట్స్''

''ఓహో... తెలుగు మీడియం చదువులు అక్కర్లేదని వాళ్ళ డిమాండ్ అన్న మాట''

''ఏం చేస్తారట?''

''ఆఁ... ఏముంది రేపట్నుంచీ రాస్తా రోకోలు, రైలు రోకోలు, బస్సులు పగల గొడతారు. ఇంకా అయితే తగులబెడ్తారు.

''సంతోషం'' అనుకుంటూ తన దారిన తను పోయాడు దానయ్య.

ఉద్యమకారులకు వత్తాసుగా ఇంగ్లీషు మీడియం స్కూళ్ళ వాళ్ళు కూడా చేతులు కలిపారు. వాళ్ళ పిల్లలకు కూడా తెలుగు పాఠ్యాంశంగా తీసేయాలనేది వాళ్ళ డిమాండ్. పిల్లలకు స్కూల్ బ్యాగుల బరువు తగ్గించాలనేది వారి సదుద్దేశ్యం. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణ దేవరాయులంతటి గొప్ప చక్రవర్తి, సాహితీ మూర్తి ప్రశంసించారు. అలాంటి తెలుగుని వద్దంటూ తెలుగు వారి పోరాటమా! అంటూ లబలబలాడారు కొద్ది మంది పాత తరం వారు. హైటెక్ వాదనలతో వాళ్ళ నోళ్ళు మూయించారు ఉద్యమకారులు.

తమకు న్యాయం జరిగే వరకూ, న్యాయమైన తమ డిమాండ్ తీర్చే వరకు ఉద్యమం కొనసాగి తీరుతుందనీ, అప్పటి వరకు పాఠశాలల తలుపులు తెరుచుకోవని ఘంటాపథంగా చెప్పేశారు. వారికి మద్దతుగా మరికొన్ని అసోసియేషన్‌ల వారు, ఇతరులు సానుభూతి పరులుగా ప్రకటించుకున్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా బంద్ కారణంగా హాయిగా ఇళ్ళల్లో కూర్చున్నారు ఒకరోజు.

ఇరుపక్షాల వారిని కూర్చోబెట్టి సావధానంగా చర్చించిన మీదట ఓ అంగీకారానికి వచ్చేటట్లు చేయటంలో కృతకృత్యులయ్యారు మధ్యవర్తులు. చర్చల సారాంశం ఏమంటే... తెలుగు మీడియం స్కూళ్ళ సంఖ్య చాలా వరకూ కుదించి పరిమితంగా వుంచుతారు. ప్రస్తుతానికి దశల వారీగా పూర్తిగా ఎత్తివేసి తదుపరి నిషేధం అమలు చేయటం, అప్పటి వరకూ మాధ్యమాల్లో నిమిత్తం లేకుండా తెలుగు పాఠ్యాంశంగా పరీక్షకు హాజరయిన ప్రతి విద్యార్థికీ నూటికీ నూరు మార్కులు ప్రకటించి, వాటిని ర్యాంకుల నిర్ణయంలో పరిగణనకు తీసుకునే విధంగా నిర్ణయించారు. ఉభయకుశలోపరి అన్న చందంగా అటు తెలుగు మాష్టార్ల ప్రాణం దక్కింది. ఇటు మధ్యవర్తుల మాట దక్కింది. ఉద్యమకారులు సంతృప్తి చెందారు. బస్సుల దహనం దాకాపోకుండా ధ్వంసంతో ఆగింది ఎలాగో.

***

''సెన్సార్... డౌన్ డౌన్''

''సెన్సార్ సభ్యుల్ని వెంటనే...''

''సస్పెండ్ చేయాలి, సస్పెండ్ చేయాలి''

అరుపులు, ఈలలు, నుదుటికి ఎర్రపీలికలు, డాన్సులు, డప్పులు, చిందులు, గంతులు... పాటలు...

అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు అడ్డంగా నిల్చున్నారు. బస్సును ఆపక తప్పింది కాదు డ్రైవరుకు. ప్రయాణీకులందర్నీ బస్సు దిగమని హెచ్చరించారు గుంపు గుంపంతా కలసి ఓ అయిదారుగురు అప్పటికే టైర్లలో గాలి తీసే కార్యక్రమం చేపట్టారు. మరో పది మంది బస్సులోకి ఎక్కి ప్రయాణీకుల్ని దింపసాగారు. సీట్లని తన్నటం, బ్లేళ్ళు పెట్టి సీట్లు కోయటం ప్రారంభించారు.

''ఎందుకు బాబు ఈ గొడవ. దేనికోసం బస్సులు పాడుచేస్తున్నారు?'' చస్తే చచ్చాననుకున్నాడు కాబోలు బస్సు దిగుతూ అడిగాడు అరవై సంవత్సరాలు పై బడిన వ్యక్తి ఒకడు సాహసించి.

''ఎందుకా.... సినిమా బాక్సులు రాలా... ఈ సినిమా రిలీజ్ ఆలస్యం కావటానికి సెన్సారు వాళ్ళే కారణం అని తెలిసింది. అందుకే గొడవ చేస్తున్నాం'' గర్వంగా చెప్పాడు గుంపులోంచి ఓ గోవిందుడు.

ఫలానా వూళ్ళో ఫలానా హీరో అభిమాన సంఘం వాళ్ళు, వాళ్ళ అభిమాన హీరో సినిమా ప్రకటించిన రోజున విడుదల కానందుకు నిరసనగా బందుకు పిలుపునిచ్చారని రాస్తారోకోలు చేస్తున్నారని, బస్సుల్ని తగులబెట్టడం దాకా అలజడి పెరిగిందని విని వూరూరా అదే తంతు ప్రారంభించారు. అన్ని చోట్లా అదేరకం ఆందోళన చేపట్టారు. అంతే లెక్కకు మించిన బస్సులు అగ్నికి ఆహుతి అయినై. సమర్థులందరూ సెన్సార్ ఆఫీసు చుట్టుముట్టారు. నీతో, బూతో, ఎలాగున్నా ఫరవాలేదు. రీలు బయటకు పంపమని వేడుకున్నారు. అభిమానుల వేడి చల్లార్చారు. బస్సులకు వేడి సోకకుండా అడ్డుకున్నారు.

అప్పటి వరకు వివిధ ఆందోళనా కార్యక్రమాల్లో అగ్నికి ఆహుతి అయిన బస్సుల విలువ, పాక్షికంగాను, పూర్తిగానూ ధ్వంసం అయిన బస్సుల విలువ లెక్కలు కడితే కోట్లలో తేలింది.

అధికారులంతా గణాంకాలను పరిశీలించి గుణకారాలు, భాగహారాలు చేసి తర్కించి, చివరకు జరిగిన నష్టాన్ని, పెరిగిన పెట్రోలు ధరల్ని పరిగణనలోకి తీసుకుని అనివార్య పరిస్థితుల్లో బస్సు చార్జీలు పెంచక తప్పడం లేదంటూ పెరిగిన చార్జీలను ప్రకటించారు. అంతే ప్రజల ప్రయోజనార్థం మరోసారి మరికొన్ని బస్సులు ధ్వంసం, దగ్ధం అయ్యాయి. చివరికి పెంచిన రేట్లలో కొంచెం సడలించటంతో సద్దుమణిగింది ఉద్యమం.

మిగిలిన బస్సులు భయం భయంగా రోడ్లమీదికి వచ్చినై. దినదిన గండంగా తిరగనారంభించాయి.

సరిగ్గా అప్పుడే చచ్చాడో నాయకుడు. కాదు కాదు చంపేశారు. చచ్చాడో, చంపేశారో గానీ, ఎంకి పెళ్ళి సుబ్బిచావుకన్నట్లు అతగాడి మరణం మారణ హోమాన్ని సృష్టించింది. ముఖ్యంగా ఆర్టీసీ వారి పాలిట శాపం అయ్యింది. అతగాడు పుట్టింది, పెరిగింది పగ, ప్రతీకారాల మధ్య, విద్వేషాల మధ్య కక్షలు, కార్పణ్యాలు వారికి తరతరాల నుంచి వస్తున్న తరగని సంపద, ప్రాణాలు దీయటం, ఫణంగా పెట్టటం రెండింటిలోనూ ఆరి తేరిన వారే.

అలాంటి మనిషి ప్రాణాలు పోవడంతో మరోసారి రాజకీయం రచ్చ చేసింది. రాక్షస క్రీడ సల్పింది. దానవత్వం నోరు విప్పింది. మానవత్వం మర్చిపోయింది, దహన కాండకు పూనుకుంది. ఒక ఊరు కాదు, ఒక పట్టణం కాదు. రాష్ట్రం నలుమూలలకు వ్యాపించిన వెర్రి ఆవేశం వందల్లో బస్సుల్ని అగ్నికి ఆహుతి చేసింది.




కక్షల్తో, పగల్తో నిత్యం వైషమ్యాల మధ్యన బ్రతికే మనుషుల మరణం అలానే ముగుస్తుందనే సందేశాన్ని అందించి మరొకరు అలాంటి నేపథ్యంలోకి వెళ్ళకుండా చేసే ప్రయత్నం చేయాలనే ఆలోచన లేకుండా పోయింది. అలాంటి వారిని హీరోలుగా చేసి అక్కర్లేని ప్రాధాన్యతనూ ఇచ్చి అనవసర రాద్ధాంతం చేశారు. మన ఆస్థిని బుగ్గిపాలు చేశారు. బూడిదగా మార్చారు.

ఈ మూలిగే నక్కలమీద ఇలా తాటికాయలు పడుతూ వుండవలసిందేనా! అనే అనుమానం కలిగితే సరే! కానీ నక్కలు బస్సులా! బస్సుల్లో తిరిగే మనమా?

*

కవిత
poem




నా ముందు కొన్ని పిల్లకాలువలు
చేతులు కట్టుకు కూర్చున్నాయి
విప్పార్చిన వాటి నీలికళ్లల్లో
గొప్ప చలనంగా చంచలంగా
ఉరకలేస్తున్న చైతన్యఝరి..
కిలకిల రావాలుగా తుళ్లుతూ
నవ్వుల నురుగలుగా ప్రవహిస్తున్న
ఈ పిల్లకాలువల్ని అల్లుకునే
నా కార్యక్షేత్రమంతా కర్తవ్యమంతా
మైదానంలా పరచుకొని  వుంది.
ఇంత జ్ఞానాన్ని సంస్కారాన్ని
ఈ తరానికి రగిలించే రంగరించే
తరగతి గది కర్మాగారంలో
పిల్లకాలువలన్నీ సంగమించే సందడించే
తరగతి గది సంగమ స్థలిలో
తదేక ధ్యానంలో అలలూగుతూ వున్నాను.
ఎలా ప్రవహించాలో ఎటు ప్రవహించాలో
ఎందుకు ప్రవహించాలో ఎంత ప్రవహించాలో

# ప్రవహించినంత మేరా...

ప్రతి మలుపు దగ్గరా ఒక కొండ చరియలా నిలబడి
పంటపొలాల్లోకి నీళ్లు మళ్లించే రైతులా
పిల్లకాలువల్ని మళ్లిస్తున్నాను.
గులకరాళ్లని గుండ్రాళ్లుగా మృదుపరచడమెలాగో..
దడ్సి నెర్రబారిన నాలుకల మీద
నీటిజాలై జాలువారి దప్పిక తీర్చడం ఎలాగో
కన్నీళ్లూ ఎండిన కరువు నేలమీద
నిశ్శబ్దంగా నిమ్మళంగా నీటిచెమ్మగా ఉబకటమెలాగో..
ప్రవహించినంత మేరా
ప్రతిదాన్నీ లోపలికి గ్రహించడమెలాగో..
లోపలికి హత్తుకున్న ప్రతిదాన్నీ
బంగారు ద్రావకంగా జీవ ధాతువుగా
పునః ప్రతిష్ఠించుకోవడమెలాగో
అవును నిజమే
ప్రవహించాల్సిన చోటకి ప్రవహించాలంటే
'ఉన్నత కొలువుల' ఒరవడీ అవసరమే..
దాహంగొన్న దోసిట్లో గుండెబీటలు తడిసేలా
ఇన్ని నీళ్లు పోసి, తృప్తి కళ్లై వాళ్లు మరలిపోతుంటే
చూసి మై మరవాలంటే
నిండుగా కళ్లనిండుగా సమృద్ధిగా ప్రవహించడమూ అవసరమే-
నిండుగా ప్రవహించడమెలాగో
నేల మాళిగల్లోంచి మాగాళుల పొలాల్లోకి
పరివ్యాపితమవ్వడం ఎలాగో..
ప్రవహించినంతమేరా
పుట్టినచోటుకి పటం కట్టడం ఎలాగో..
ఆత్మీయ జనహృదయాల్లో
నీటికాంతుల ప్రతిఫలనమై ఉన్నతంగా కొలువుండటమెలాగో..
ఈ పిల్లకాలువల్లో ఇన్ని పాఠాలదోనె దీపాల్ని
వెలిగించి వదులుతున్నాను.
రేపటికీ కాలువలు నదులై జీవనదులై
పచ్చని జీవితాన్ని ప్రసాదించే,నా కలల నీడల్ని ప్రతిఫలించే
ఒక స్వాప్నిక ఉత్సవాన్ని ఆవలోకిస్తున్నాను.
కరకట్టల్ని ఎగదన్నుతూ
జీవనదుల్లో కలిసేందుకు.. జీవనదులుగా ఎదిగేందుకు
నా ముందు కొన్ని పిల్లకాలువలు
చేతులు కట్టుకు కూర్చునాయి!

- పి. శ్రీనివాస్ గౌడ్